కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి ఆకాశ్

నార్నూర్, ఫిబ్రవరి 8 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని ఉప మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని శనివారం వ్యవసాయ అధికారి ఆకాశ్ ప్రారంభించారు. కందులు విక్రయించేందుకు తీసుకువచ్చిన రైతును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారుల వద్ద కందులు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550 ఉందని పేర్కొన్నారు. కందులు విక్రయించే రైతులు తమ ఆధార్‌కార్డు పట్టపాస్ పుస్తకం, అకౌంట్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో ఆడే గణేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ ఓసమా, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, ఫిబ్రవరి 8: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని సాకేర గ్రామ మాజీ సర్పంచ్ ధరావత్ మీరాబాయి, బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన కారెం శివన్న ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, చంద్ర మోహన్, బీఆర్ఎస్ బోథ్ పట్టణాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, డాక్టర్ స్వామి ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించేలా కృషి చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 8 : బోధన అభ్యసన పరికరాలను వినియోగించుకుంటూ నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత సూచించారు. శనివారం ఆదిలాబాద్‌లోని గెజిటెడ్ నంబర్-1 పాఠశాలలో ఉపాధ్యాయులకు డిజిటల్ బోధనలో భాగంగా నిర్వహించిన ఐఎస్సీ, ఎంఎలెస్పై శిక్షణను ప్రారంభించారు. మాస్టర్ ట్రైనర్లు ఎం సవితదేవి, ఎన్ నిరోజన డిజిటల్ బోర్డుపై విద్యార్థులకు బోధించే అంశాలను వివరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలి

నార్నూర్, ఫిబ్రవరి 8 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ డీడీ జాదవ్ వసంత్‌రావ్ సూచించారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న జాదవ్ మౌనిక రెండో స్థానంలో గెలుపొందడంతో శాలువాతో సన్మానించారు. అలాగే క్రీడల్లో రాణించేలా కృషి చేస్తున్న ఆడే విశ్వనాథ్‌ను అభినందించారు. పాఠశాలకు సంబంధిత రికార్డులు పరిశీలిస్తూ, వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులను పర్యవేక్షిస్తూ, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వార్డెన్ పవార్ వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సొనాల గ్రామస్తులు

బోథ్, ఫిబ్రవరి 8: ఇటీవల కొత్త మండలంగా ఏర్పాటైనా సొనాల గ్రామస్తులు శనివారం నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ భీంరావ్ పాటిల్, నాయకులు నరేందర్, సుధీర్ రెడ్డి, చిన్నయ్య, అభిలాష్, సోమన్న, హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోథ్: ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో సొనాల గ్రామస్తులు

రాములగుట్ట ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

తాంసి, ఫిబ్రవరి 8: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పాలోడి గ్రామ సమీపంలోని రాముల గుట్టపై వెలసిన ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దర్శించుకున్నారు. ముందుగా సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల వినతి మేరకు వచ్చే ఏడాది వరకు భక్తుల సౌకర్యార్థం రోడ్డు, షెడ్డు, విద్యుత్, మౌలిక సదుపాయాలు ఆ భగవంతుడు అనుగ్రహంతో కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, వినోద్ రెడ్డి, ఆశన్న, ఉత్తమ్, మహేందర్, అండె అశోక్, లక్ష్మీపతి, రమణ, భూమన్న, చంద్రయ్య, రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

గుబిడి పల్లెకు రోడ్డు కల్పించాలని వినతి

పాలోడి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుబిడి పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌తో మొరపెట్టుకున్నారు. రోడ్డు సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ పాలోడి, గుబిడి గ్రామస్తులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తలమడుగు, ఫిబ్రవరి 8: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గోక మహేందర్ రెడ్డి, రుయ్యాడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిట్యాడి గంగాధర్ తండ్రి మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుడిహత్నూర్, ఫిబ్రవరి 8 : గుడిహత్నూర్‌లోని మహాంకాళి మందిర్ వ్యవస్థాపకుడు, పూజారి గోండ్ శంకర్ గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సంజీవ్ ముండె, రావణ్ ముండె, జాదవ్ రమేశ్, నీలకంఠ అప్పా ఉన్నారు.

తప్పుల తడకగా రేవంత్ రెడ్డి సర్వే

మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి నాయకులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 8: రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని రాష్ట్ర బీసీ రాజ్యాధికార సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడారు. బీసీల జనాభా 52 శాతం ఉండగా తప్పుడు లెక్కలతో 46.25 శాతానికి తగ్గించి చూపించారని ప్రభుత్వంపై మండి పడ్డారు. గతంలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే ద్వారా బీసీలు 52 శాతం ఉండగా పదేండ్లలో బీసీల జనాభా పెరిగాల్సి ఉండగా 5 శాతం తగ్గింది సర్వే నివేదికను ప్రభుత్వానికి సమర్పించడం వెనుకకుట్ర దాగి ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి చేసిన సర్వే ఉన్నతవర్గాలకు మేలు చేసే విధంగా ఉంది తప్ప బీసీలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని అన్నారు. ఈ సర్వే ద్వారా బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఐక్యతతో ఖండించాలని తెలిపారు. సమావేశంలో ప్రశాంత్, చిన్నయ్య, కాల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ దరఖాస్తులు చేసుకోమనడం విడ్డూరం

ఎదులాపురం, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు గ్రామ, వార్డు సభలతో పాటు ప్రజాదర్బార్ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించిందని, కానీ ఇప్పుడు రేషన్ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్ మండిపడ్డారు. శనివారం ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రూ.500 గ్యాస్, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్‌తో పాటు ఇతర పథకాల కోసం ఇటీవల గ్రామ, వార్డు సభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకున్నారు. అయితే ఆహార భద్రత కార్డుపై కాంగ్రెస్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి విధివిధానాలు ప్రకటించిందన్నారు. మరోసారి మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం జీవో ఇచ్చి వెబ్‌సైట్‌ను ప్రారంభించిందన్నారు. సాయంత్రం ఐదు గంటలకు సైట్ ప్రారంభమై ఉదయం 8 గంటలకు మూసి వేశారన్నారు. ప్రజలు నిద్రించే సమయంలో వెబ్‌సైట్ ఉంచితే ఎలా దరఖాస్తులు చేసుకుంటారని ప్రశ్నించారు. కొత్త నిబంధన తీసుకువస్తే గ్రామ, వార్డుల సభల్లో ఎందుకు దరఖాస్తులు తీసుకున్నారని ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు.

మళ్లీ మోసపోయాం

బైంసా, ఫిబ్రవరి 8: కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు మీ సేవలో చేసుకోవాలని శుక్రవారం నుంచి సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మీ సేవ సెంటర్లకు వెళ్లడంతో సైట్ బంద్ ఉండడంతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సుంకెట మహేశ్‌బాబు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోసపూరిత ప్రకటనల ద్వారా ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు.

శబ్ద కలుష్యానికి కారణమైన
వాహనాలపై పోలీసుల కొరడా

ఎదులాపురం, ఫిబ్రవరి 8 : ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పులు చేసి శబ్ద కాలుష్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి శబ్ద కాలుష్యానికి కారణమైన వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రత్యేక సైలెన్సర్లను తొలగించారు. మరోసారి పునరావృతమైతే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ఎదులాపురం, ఫిబ్రవరి 8: ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో ఈ నెల 11వ తేదీన టీఏఎస్‌కే ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన గ్లీట్స్ కోర్ప్ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అతీక్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగానికి పదో తరగతి లేదా ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకొని, చదువుతున్న (2025 పాస్ అవుట్) మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో, ఆధార్, పాన్ కార్డులతో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ కోటయ్య, మెంటర్ చైతన్య, 9885762227 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రేషన్ కార్డుల నాటకం

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 8 : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల మంజూరు నాటకం ఆడుతుందని బీఆర్ఎస్ సిరికొండ మండల నాయకుడు ఓరగంటి పెంటన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నిలబెట్టిన అభ్యర్థులు గెలుస్తున్నారని సర్వే రిపోర్ట్ చెప్పడంతో కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డుల జారీ నాటకం ఆడుతుందన్నారు. ప్రజలను పీడిస్తూ దరఖాస్తుల పేరిట తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు రేషన్ కార్డు కోసం ఇచ్చిన దరఖాస్తులు ఎటుపోయాయని ప్రశ్నించారు. అలాగే సమగ్ర సామాజిక ఆర్థిక సర్వేలో మళ్లీ రేషన్ కార్డు కోసం లబ్ధిదారులు ఆప్షన్ పెట్టుకోగా ఆ దరఖాస్తులు కూడా ఎటు పోయాయని ప్రభుత్వం దృష్టికి ఇప్పటికే వెళ్లిన మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేసుకోమనడం లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని ప్రజాపాలన ఇచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వందశాతం బీఆర్ఎస్ పార్టీ నాయకులే విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఔరంగజేబు కాలం నాటి నాణేలు లభ్యం

నాణేలను పరిశీలిస్తున్న అధికారులు

బాసర, ఫిబ్రవరి 8 : నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రంలో ఔరంగజేబు కాలం నాటి దాదాపు 350 ఏండ్ల క్రితం నాణేలు బయటపడ్డాయి. వివరాల ప్రకారం.. ముథోల్‌కు చెందిన లూటే మారుతి తన పశువుల పాక తొలగించి నూతన ఇంటిని నిర్మించడానికి శుక్రవారం పునాదుల కోసం తవ్వుతున్నాడు. గడ్డపారకు ఒక కుండ తగిలి అందులోని నాణేలు బయటడ్డాయి. గమనించిన మారుతి ఎస్సై సంజీవ్‌కు సమాచారం అందించాడు. దీంతో ఎస్సై సంజీవ్, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణలు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. 92 నాణేలు బయటపడగా.. ఇవి దాదాపు 350 ఏండ్ల క్రితం నాటి ఔరంగజేబు కాలంలో చలామణిలో ఉన్నట్లు భావిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకుని జిల్లా ఖజానాలో జమ చేసినట్లుగా అధికారులు తెలిపారు. నాణేల విషయం గ్రామంలో తెలియడంలో పలువురు అక్కడికి చేరుకుని ఆసక్తిగా తిలకించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

ప్రియుని ఇంటి ఎదుట యువతి, కుటుంబ సభ్యులు

బోథ్, ఫిబ్రవరి 8: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడి ఇంట్లో యువతి మకాం వేసిన ఘటన వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన జాదవ్ నవీన్ అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. ఏడాది కాలంగా వీరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతుంది. ఆ తర్వాత పెళ్లి చేసుకోమని యువతి ఒత్తిడి చేయడంతో యువకుడు నిరాకరించాడు. ఈ విషయమై జనవరి 29వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో యువతి, కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి ఇరువురిని పెళ్లికి ఒప్పించారు. అయితే రూ.3 లక్షల వరకట్నం ఇవ్వాలని యువకుని కుటుంబీకులు డిమాండ్ చేయడంతో పెద్దల తీర్పును ఒప్పుకోకపోవడంతో ఇరు కుటుంబీకులకు ధరావత్ సొమ్మును సైతం తిరిగి ఇచ్చారు. యువకుడు తనను మోసం చేశాడని, పెళ్లి చేసుకోవడం లేదని ప్రియుడి ఇంట్లోనే మకాం వేసింది. యువకునితో పాటు వారి తల్లిదండ్రులు ఇండ్లు విడిచి వెళ్లి పోయారు. యువతి మాత్రం 45 రోజులుగా యువకుని ఇంట్లో ఉంటుంది. తనకు న్యాయం చేయాలని కోరుతుంది. కాగా ఈ విషయమై ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సంప్రదించగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. అయితే ఇది వరకే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పంపించామని వివరించారు.

డైరీ ఆవిష్కరణ

ఎదులాపురం, ఫిబ్రవరి 8: ఆదిలాబాద్ కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా సహకార శాఖ కార్యాలయంలో శనివారంజిల్లా సహకార అధికారి మోహన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ సహకార ఉద్యోగుల సంఘం జిల్లా డైరీనిఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, సెక్రటరీ విక్రాంత్, రాష్ట్ర నాయకులు గంగాధర్, కార్యాలయ పర్యవేక్షకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భైంసాలో పట్టుబడిన రేషన్ బియ్యం పరిశీలించిన రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం

భైంసా, ఫిబ్రవరి 8 : బియ్యం లోడుతో వెళ్తున్న లారీ నిర్మల్ జిల్లా భైంసాలోని శివాజీ చౌరస్తాలో ఓ కారును ఢీ కొనడంతో శుక్రవారం రాత్రి పోలీసులకు పట్టుబడింది. బియ్యం లోడుతో భైంసా మీదుగా వెళ్తున్న లారీ పట్టణంలోని శివాజీ చౌక్‌లో యూటర్న్ తీసుకుంటున్న సమయంలో కారుకు ఢీ కొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు లారీని పట్టుకొని సీజ్ చేయగా, లారీలో ఉన్న లోడును పరిశీలించగా పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. వెంటనే సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. 30 టన్నుల పైగా పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఏఎస్సై అవినాశ్ కుమార్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయన్న విషయాలు పూర్తి దర్యాప్తులో తేలుతాయన్నారు.

పట్టుబడింది పీడీఎస్ బియ్యమే

ధర్మాబాద్ నుంచి లారీలో తరలిస్తూ పట్టుబడింది పీడీఎస్ బియ్యమేనని సివిల్ సప్లయ్ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం రాత్రి భైంసాలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో పట్టుబడిన బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మాబాద్ నుంచి గోండియాకు తరలిస్తున్నట్లు చెబుతున్న మాట అవాస్తవమని, పట్టుబడిన బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్ ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిపై పోలీసు శాఖ విచారణ జరుపుతోందని, తాము కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో ఓఎస్‌డీ శ్రీధర్ రెడ్డి, డీఎస్పీ శేఖర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రావు ఉన్నారు. వారి వెంట డీసీఎస్‌వో కిరణ్ కుమార్, డీటీ ప్రకాశ్, ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ బాపురావు ఉన్నారు.

సదర్‌మాట్ కాలువలో కొనసాగుతున్న నీటి మట్టం

ఖానాపూర్, ఫిబ్రవరి 8 : ఖానాపూర్, కడెం మండలాల ఆయకట్టు రైతులకు సదర్‌మాట్ ప్రధాన కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటి మట్టాన్ని విడుదల చేస్తున్నట్లు ఏఈఈ నితిన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కాలువలో 6 అడుగుల సాగు నీరు ప్రవహిస్తున్నది. సదర్‌మాట్ ప్రధాన కాలువ కింద రైతులు వరినాట్లు సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 15 లోపు కోత దశకు వచ్చే వరి పంటలు సాగు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆయకట్టు చివరి వరకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ

దస్తురాబాద్, ఫిబ్రవరి 8 : దేవునిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో గంగాధర్ తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, పలు రికార్డులను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలను విద్యార్థులతో చదివిపించి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మెరుగైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం రాజుకుమార్ ఉన్నారు

విద్యుత్ ఆర్డిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 8 : విద్యుత్ ఆర్డిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని టీవీఏసీజేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావ్ డిమాండ్ చేశారు. శనివారం ఆదిలాబాద్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న బడ్జెట్‌లో కన్వర్షన్ బిల్లు ప్రవేశ పెట్టేలా కాంగ్రెస్ చూడాలని లేని పక్షంలో సమ్మె చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ వజీర్, ఫైనాన్స్ కార్యదర్శి సదానంద్, సలీంపాషా, చంద్రయ్య, రాథోడ్ సంజీవ్, సతీశ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లోని స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీవో అరుణరాణి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. దివ్యాంగులు, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడే వారి కోసం కేంద్రాల వద్ద ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

గౌడ కులస్థుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 8: గౌడ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు పాటుపడాలని తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ ఆధ్వర్యంలో పట్టణ ఎక్సైజ్ సీఐ రంగస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు .కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘాల రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, గోపి, రాజేందర్, బాలగౌడ్, వెంకట్, దశాగౌడ్ ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గుండుంబా విక్రయ స్థావరంపై దాడి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 8: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామ శివారులో గుండుంబా విక్రయిస్తున్న స్థావరంపై శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు.అధికారులను గమనించిన గుడుంబా విక్రయదారులు అక్కడి నుంచి పారిపోయారు. గుడుంబా ప్యాకెట్లతో పాటు ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలి వెళ్లడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ అభిషేక్ తెలిపారు. ఈ దాడిలో ఎక్సైజ్ సిబ్బంది చంద్రశేఖర్, గౌతమ్, నిరోషా, వెంకటేశ్ పాల్గొన్నారు.

రెగ్యూలర్‌గా నీటిని విడుదల చేయాలి

కడెం, ఫిబ్రవరి 8 : సదర్మాట్ నుంచి కడెం మండలంలోని లింగాపూర్, మాసాయిపేట, సారంగాపూర్, దిల్దార్‌నగర్, నచ్చన్‌ఎల్లాపూర్, ధర్మాజిపేట, మద్దిపడగ, లక్ష్మీసాగర్, చిట్యాల, బెల్లాల్ గ్రామాల రైతుల పంటలకు వారబంధి పద్ధతిన నీటిని విడుదల చేయడం వల్ల పంటలకు నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నామని, రెగ్యూలర్‌గా నీటిని విడుదల చేయాలని గ్రామాల రైతులు నీటి పారుదల, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అలాగే సదర్మాట్ జేఈ విశాల్ రైతులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకున్న డీఈఈ నవీన్ వారబంధి పద్ధతిన ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని, వారబంధి పద్ధతిన మాత్రమే నీటి విడుదల సాధ్యమవుతుందని, రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ ప్రభాకర్, ఏవో దినేశ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ క్లినిక్ తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ మెట్‌పల్లివార్ శ్రీధర్

ఎదులాపురం, ఫిబ్రవరి 8: ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎన్‌సీడీ క్లినిక్‌ను శనివారం ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మెట్‌పల్లివార్ శ్రీధర్ తనిఖీ చేశారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో నమోదైన ఔట్ పేషంట్ వివరాలు, డ్రగ్ స్టాక్ పొజిషన్, ల్యాబ్ టెస్ట్ వివరాలతో పాటు క్లినిక్‌లో నమోదైన హైపర్ టెన్షన్ డయాబెటిస్ కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎన్‌సీడీ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, వెంకటరమణ, నోడల్